కర్నూలు నగరంలో ఉధృతంగా ప్రవహిస్తున్న హంద్రి నది

అన్నదాతకు.. 'సుఖీభవ' కష్టాలు

- తెరుచుకోని గ్రీవెన్స్ పోర్టల్ - డబ్బులు పడని వారికి తప్పని తిప్పలు

అన్నదాత సుఖీభవ కింద రైతులకు డబ్బులు జమ చేశామని ప్రభుత్వం చెబుతున్నా పలు కారణాల వల్ల ఇప్పటికీ చాలా మంది రైతుల ఖాతాల్లో డబ్బులు పడలేదు. డబ్బుల జమలో ఉన్న ఇబ్బందులను పరిష్కరించుకోవడానికి తీసుకొచ్చిన గ్రీవెన్స్ పోర్టల్ ఓపెన్ కాకపోవడంతో డబ్బులు పడని రైతులకు తిప్పలు తప్పడం లేదు..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రైతులకు అన్నదాత సుఖీభవ కష్టాలు తొలగడం లేదు. ఆగస్టు రెండో తేది నుంచి రైతుల ఖాతాల్లో మొదటి విడత అన్నదాత సుఖీభవ డబ్బులు వేయడం ప్రారంభించారు. కర్నూలు జిల్లాలో 2,77,752 మంది రైతులను, నంద్యాల జిల్లాలో 2.07 మంది రైతులను లబ్ధిదారులుగా ప్రకటించారు. వారికి నగదు జమ చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటి వరకు డబ్బులు పడని వారి సంఖ్య గణనీయంగా ఉండటం గమనార్హం. పథకం నిబంధనల ప్రకారం ఖాతా యాక్టివ్‌గా లేకుంటే నగదు జమ కాదు. దీంతో పాటు భూమి రికార్డులకు ఆధార్ అనుసంధానంతో పాటు రైతు ఈకేవైసీ కూడా చేయించుకోవాలి. వీటిపై చాలా మంది రైతులకు అవగాహన లేకపోవడంతో చేయించుకోలేదు. కొందరు సిబ్బంది సైతం వారికి సమాచారం ఇవ్వకపోవడంతో పథకానికి దూరమయ్యారు. డబ్బులు పడని వారు తిరిగి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి డబ్బులు వేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అందుకు సంబంధించిన గ్రీవెన్స్ పోర్టల్ క్లోజ్ అయ్యింది. దీంతో ఎవరిని సంప్రదించాలో కూడా తెలియని పరిస్థితి ఉంది. వ్యవసాయ శాఖ కార్యాలయం వద్దకెళ్తే సచివాలయంలోనే అడగాలని అంటున్నారు. సచివాలయానికి వెళ్తే వ్యవసాయ కార్యాలయానికి వెళ్లాలని చెబుతున్నారు. రెండు దగ్గరకెళ్లినా ఫలితం ఉండటం లేదు. అన్నదాత సుఖీభవ సంబంధించి ఆగస్టు 20వ తేది నాటికే గ్రీవెన్స్ పోర్టల్ క్లోజ్ అయింది. లబ్ధిదారులకు అన్నదాత మంజూరులో సమస్య వస్తే వాటిని సరిచేసేందుకు వీలులేకుండా కార్యాలయాల వద్దకు తిరుగుతున్నా వారు కూడా ఏమి చేయలేకపోతున్నారు. ప్రభుత్వం గ్రీవెన్స్ పోర్టల్ ఓపెన్ చేస్తే అందులో లబ్ధిదారుల వివరాలు మేరకు వారి వివరాలను సరిచేయడానికి వీలవుతుంది. ప్రస్తుతం ఆ అవకాశం లేకపోవడంతో సమస్యలు ఎక్కడిక్కడే ఉంటున్నాయి.

ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలి

అన్నదాత సుఖీభవను రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత ఆగస్టు రెండో తేదీ ప్రారంభించినా ఇప్పటికీ చాలా మంది రైతులకు డబ్బులు వారి ఖాతాల్లో పడలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి సమస్యలున్న వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేకంగా గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేయాలి. లబ్ధిదారుల నుంచి అర్జీలు తీసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

- జి.రామకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

ఉధృతంగా ప్రవహిస్తున్న హంద్రి

- రాకపోకలకు అంతరాయం
- లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గాజులదిన్నె ప్రాజెక్టు పూర్తిగా నిండుకుంది. రెండు గేట్ల ద్వారా నీటిని కిందకు వదలడం వలన హంద్రీ పరవళ్లు తొక్కుతుంది. దీనితో వక్కెర వాగు పై కల్లూరు నుండి కర్నూలుకు వచ్చే దారిలో ఉన్న వంతెన తగ్గులో ఉండడం వల్ల వంతెనపై నీరు ప్రవహిస్తుంది. కల్లూరుకు కర్నూలుకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు పనులకు వెళ్లే వారు చుట్టూ తిరిగి రావాలంటే సుమారు ఐదు కిలోమీటర్ల దూరం పెరుగుతుంది. దీంతో పనులకు వెళ్లే కూలీలు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పనుల కోసం కర్నూలు నగరానికి వచ్చే కల్లూరు వాసులు వక్కెరవాగు వంతెన పైన ప్రయాణించి రావాల్సి ఉంటుంది. అలాంటిదే వంతెన పై భారీగా నీరు ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు కూలీలు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. వైసిపి ప్రభుత్వంలో వక్కెరవాగుపై ఉన్న వంతెన ఎత్తు పెంచాలని ప్రజాసంఘాల ఆందోళనలు ధర్నాల ఫలితంగా ప్రభుత్వం స్పందించి రూ.నాలుగు కోట్లతో అంచనాలను తయారుచేసి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించకపోవడంతో వంతెన నిర్మాణపనులు చేపట్టలేదు. ఎప్పుడు కురిసినా ఇదే పరిస్థితి ఉండడంతో సిపిఎం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పర్యటనలు ధర్నాలు చేసిన ఫలితంగా నగరపాలక సంస్థ నిధులతో పైపైన కంకర సిమెంట్ వేసి చదును చేసి గుంతలు పడిన వాటిని పూడ్చారు. మళ్లీ యథావిధిగా ప్రయాణాలు సాగుతున్నాయి. కింది భాగాన మాత్రం బ్రిడ్జి కూలడానికి సిద్ధంగా ఉంది. అంతేకాక బుధవారపేట ఆనుకొని ఉన్న హంద్రీ ఒడ్డున ఉన్న హబీబ్ ముబారక్‌నగర్ ఇంకొక రెండు రోజులు వర్షాలు పడినట్లు అయితే అందరి నీరు ఇళ్లలోకి చేరి ఇల్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. హంద్రీని ఆక్రమిస్తూ కట్టుకున్న ఇండ్లను అన్నింటిని ప్రభుత్వం వెంటనే వాటిని తొలగించి వరదల సమయంలో ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆనంద్ టాకీస్ వద్ద గల బ్రిడ్జి కింద హంద్రీ నీరు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హంద్రీ తుంగభద్ర నదుల నీరు నగరంలోకి రాకుండా రక్షణ గోడలు కూడా నదులకు ఇరువైపులా కట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ బ్రిడ్జిని ఎత్తు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, హంద్రీకి తుంగభద్ర కు రక్షణ గోడలు కూడా నిర్మించాలని కల్లూరు, కర్నూలు ప్రజలు కోరుతున్నారు.

సామాజిక చైతన్య దిక్సూచి జాషువా

- సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

దళిత ఉద్యమాలకు బాటలు వేసి సామాజిక చైతన్యానికి దిక్సూచిగా మహాకవి గుర్రం జాషువా నిలిచారని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు.కర్నూలు టిజివి కళాక్షేత్రంలో జరిగిన జాషువా 130వ జయంతి సభలో ఆయన మాట్లాడారు. కళాక్షేత్ర అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ జాషువా రచనలు తెలుగు సాహిత్య చరిత్రను మలుపు తిప్పడమే కాకుండా సామాజిక చరిత్రను పునర్లిఖించాయని, ఒక్క గబ్బిలం కావ్యంలోనే అనాటి దేశ సామాజిక స్థితి సామాజిక అంతరాలు అసమానతలు రాజరిక బానిస వ్యవస్థలు అన్నీ కనబడతాయని అన్నారు. జాషువా ఆశించిన సమాజం కోసం ప్రతి కవి పోరాడాలని పిలుపునిచ్చారు. అరసం జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎం.హరి కిషన్ మాట్లాడుతూ జాషువా జీవితం సంక్లిష్టతతో కూడినదని అనేక అవమానాలు ఎదుర్కొన్నారన్నారు. ఈ క్రమంలోనే అసమానతలు, వివక్షపై పోరాటం చేశారని అన్నారు. ముందుగా జాషువా చిత్రపటానికి పుష్పమాలను సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. సభాధ్యక్షులు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా కవిగా సంఘసంస్కర్తగా పేరొందారన్నారు. ఆయన రచించిన క్రీస్తు చరిత్ర పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందన్నారు.

ఒక కవి పాఠాలు చెప్పడం లేదు : డాక్టర్ దండబోయిన పార్వతి

కవిత్వం రాసి గొప్ప సాహిత్య సేవ చేస్తున్నానని చెప్పున్న ఒక కవికి తను చేసే ఉపాధ్యాయ వృత్తికి అన్యాయం చేస్తున్నారని, అటువంటి కవికి తెలంగాణ ప్రభుత్వంతో పాటు కర్నూలు జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ఇచ్చారని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ దండ బోయిన పార్వతి అన్నారు. జాషువా సాహిత్యాన్ని ఆదర్శంగా తీసుకొని కవులు జీవించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, నంది అవార్డు గ్రహీతలు మహమ్మద్ మియా, శామ్యూల్, సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షులు ఎంపి బసవరాజు, కళాకారులు, కెవి రమణ చల్లా నవీన్ కుమార్ తదితరులు జాషువా కావ్యాల్లోని పద్యాలను చదివి వినిపించారు. కవులు కళాకారులను టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య శాలువాలతో సత్కరించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా కళాక్షేత్రం ప్రధాన కార్యదర్శి యాగంటీశ్వరప్ప వ్యవహరించారు.

గుర్రం జాషువా చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న కెంగార మోహన్ తదితరులు

అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి
- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

జిల్లాలో అధిక వర్షాల వల్ల పంటలన్నీ నీట మునిగాయని, నీట మునిగిన పత్తి,ఉల్లి, టమోటా తదితర పంటలకు ఎకరాకు ప్రభుత్వం రూ.50 వేల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక కర్షక భవన్లో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు అధ్యక్షతన నిర్వహించారు. కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లా తరచూ కరువు కాటకాలకు గురవుతుందని, ఒక సారి అతివృష్టి, ఒకసారి అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈసారి అధిక వర్షాల వల్ల పంటలు బాగా దెబ్బతిని దిగుబడి పడిపోయిన పరిస్థితి ఉందని తెలిపారు. బాగా పంట చేతికి వస్తున్న సందర్భంలో వరుసగా మూడు రోజులు వర్షం అధికంగా పడటం వల్ల పంటలన్నీ దెబ్బ తిన్నాయని తెలిపారు. ఇటువంటి పరిస్థితులలో రైతులను పూర్తిస్థాయిలో ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. కర్నూలు జిల్లాలో పత్తి 5,40,000 ఎకరాల్లో, టమాటా 6000 ఎకరాలు, ఉల్లి 45 వేల ఎకరాల్లో సాగైందని, ధర లేక ఒకపక్క ఆందోళన చెందుతున్న రైతులకు ఇప్పుడు అధిక వర్షం వల్ల మొత్తం పంటలన్నీ తడిసి ముద్దయి పోయాయని తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారంగా ఇప్పటికే ఉల్లికి హెక్టారుకు రూ.50 వేలు ప్రకటించిందని, ఇప్పుడు ఉన్న ఉల్లి కూడా మొత్తం దెబ్బతినిందన్నారు. కాబట్టి మరొక రూ.50వేలు నష్టపరిహారం కింద ఇవ్వాలని కోరారు. పత్తి పంట దిగుబడి వచ్చే సందర్భంగా వర్షాలు పడి పత్తి పంట తీవ్రంగా దెబ్బతిందని, ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని, టమోటాకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు కోటకొండ సూరి, ఎ.కృష్ణ, ఉపాధ్యక్షులు హనుమంతు, రంగారెడ్డి, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

ప్రతి ఆటో డ్రైవర్‌కూ రూ.25 వేలివ్వాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లందరికీ సంవత్సరానికి రూ.25 వేలు ఇచ్చి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్, సిఐటియు న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.నరసింహులు, ఆటో యూనియన్ న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి బి.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం 19, 20 వార్డుల్లో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ల రెండవ మహాసభ 19వ వార్డులోని సిఐటియు కార్యాలయంలో వార్డు అధ్యక్షులు యేసు అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉచిత బస్సు వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకుంటానని మాట ఇచ్చిన కూటమి ప్రభుత్వం సిఐటియు పోరాటాల ఫలితంగా ఆటో డ్రైవర్ల కంటి తుడుపుగా వాహన మిత్ర ద్వారా రూ.15వేలు ఇస్తానని ప్రకటించిందని, దానికి కూడా నానా షరతులు విధిస్తూ అనేకమంది ఆటో డ్రైవర్లను అనర్హులుగా ప్రకటిస్తున్నారన్నారు. ఎలాంటి షరతులు లేకుండా వాహన మిత్ర తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 19, 20 వార్డుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. వార్డు కమిటీ అధ్యక్షులుగా ఎస్ మాలిక్ (ఒమేగా ఆటో స్టాండ్), ప్రధాన కార్యదర్శిగా జయన్న, కోశాధికారిగా యేసు, మరో 12 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. 19వ వార్డు సిపిఎం నాయకులు, ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు ఎస్ మాలిక్, రాజశేఖర్, మౌలాలి, శివకృష్ణ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అష్టావధాని డాక్టర్ బోరెల్లి హర్ష

జాషువా చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి

- పలువురు వక్తలు - జాషువా 130 జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

గుర్రం జాషువా జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు జిల్లా పరిషత్తు సమావేశ భవనంలో నవ్యాంధ్ర విద్యార్థి సమాఖ్య ద్రావిడ నాడు సంక్షేమ సంఘం మహాకవి గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలను నిర్వహించారు. విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ అష్టావధాని డాక్టర్ బోరెల్లి హర్ష, డిఎస్‌పి మహబూబ్‌బాషా, ప్రముఖ సీనియర్ అడ్వకేట్ రవి గువేర, తెలుగు భాషా వికాస ఉద్యమ నాయకులు జెఎస్ఆర్‌కె శర్మ, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామినాయక్‌లు పాల్గొన్నారు. జాషువా చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అవధాని డాక్టర్ బోరెల్లి హర్ష మాట్లాడుతూ జాషువా సామాజిక విప్లవకారుడని పేర్కొన్నారు. ఆనాటి సమాజంలో ఉన్న రుగ్మతలను తన రచనల ద్వారా సమాజానికి తెలియజేశారన్నారు. ప్రజల కష్టం నుండే కవిత పుడుతుందని ఆయన భావించారన్నారు. ఆయన గొప్ప దార్శినికుడు అని కొనియాడారు. ఆయన రచనలను, కవితలను నేటి తరం యువత తప్పనిసరిగా అధ్యయనం చేయాలని కోరారు. ఇతర అతిథులు మాట్లాడుతూ జాషువా గొప్ప సంఘ విప్లవకారుడని పేర్కొన్నారు. అలాంటి మహనీయుని జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ బూనాలన్నారు? ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి గుర్రం జాషువా స్మారక అవార్డులను అందజేశారు.

తెలుగు సాహితీ దిగ్గజం జాషువా : మాజీ ఎమ్మెల్సీ

తెలుగు సాహితీ దిగ్గజం గుర్రం జాషువ అని మాజీ ఎమ్మెల్సీ, ఎఐసిసి మెంబర్ ఎం.సుధాకర్‌బాబు అన్నారు. ఆదివారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గుర్రం జాషువా 130వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుధాకర్‌బాబు మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి దోదపడేలా ఆయన రచనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్‌సి.బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు శివకుమార్, కేశవరెడ్డి, ఐఎన్‌టియుసి మద్దిలేటి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్న వయస్సులో గుండెజబ్బులు బాధాకరం

- ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ప్రతాప్ చంద్రరత్ - కర్నూలు హార్ట్ పౌండేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్‌డే

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

చిన్న వయస్సులో గుండె జబ్బులు రావడం, చనిపోవడం బాధాకరమని హైదరాబాద్ అపోలో హాస్పిటల్‌కు చెందిన ప్రఖ్యాత కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రతాప్ చంద్రరత్ ఆందోళన వ్యక్తం చేశారు. గుండె జబ్బులు తగ్గించాలంటే వ్యక్తుల్ని స్క్రీనింగ్ చేయాలని, నిరంతరం తగిన జీవనశైలి అవలంబించాలని, రెగ్యులర్ ఎక్సర్‌సైజులు, డైట్ కంట్రోల్ ముఖ్యమని సూచించారు. ఆదివారం కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. 'అవుట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్' అవార్డుతో డాక్టర్ ప్రతాప్ చంద్రరత్‌కు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ ప్రజలను ఆర్ట్ ఫౌండేషన్ ద్వారా ఒక వినూత్న రీతిలో చైతన్య పరచడంలో ముందున్నారన్నారు. డాక్టర్ చంద్రశేఖర్ ఏర్పాటు చేసిన హార్ట్‌పౌండేషన్, హాస్పిటల్ ఆఫీసు భవంతులు, యోగా సెంటర్లు మెడిటేషన్ సెంటర్లు, జిమ్ సెంటర్లు ఆరోగ్యాన్ని కాపాడేవని అన్నారు. మద్రాసులో ఒక ధైర్యవంతమైన సర్జన్ హాస్పిటల్‌లో కుప్పకూలి చనిపోయారు. నటుడు సిద్ధాంత్ శుక్ల , కర్ణాటక నుంచి యంగ్ డైనమిక్ పునీత్‌రాజ్ కుమార్ చిన్న వయసులోనే చనిపోయారన్నారు. షిఫాలీ జరీవాలా, (కాంటాలగా సాంగ్) సినీనటి, కమెడియన్ రాజు శ్రీ వాత్సవ్ కూడా అనుకోకుండా గుండెపోటుతో మృతి చెందారన్నారు. నిన్న నేను కర్నూలు రావాలనుకునే సమయంలో 40 ఏళ్ల యువకుడు అనారోగ్యంతో గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ను కలిశాడు. తరువాత అనుమానం వచ్చింది ఎందుకంటే అతని కుడి వైపు గుండె రక్తనాళాలు మూసుకుపోయాయి. అప్పుడు అతనికి ఎడమవైపు ఒక స్టంట్ చేయాల్సి వచ్చింది. వారసత్వంగా వారి కుటుంబానికి ఇలాంటి సమస్యలున్నాయి. ఆయనకు స్టంట్ వేయడం వల్ల సేఫ్‌గా ఉన్నాడు. ఇండియాలో 25శాతం మందిలో 40 ఏళ్ల యువతలో డయాబెటిస్ ఉందన్నారు. మా కాలంలో మేము 60 ఏళ్ల దాటిన తర్వాతే గుండె జబ్బులు డయాబెటిస్ ఇవన్నీ వస్తాయనుకునే వాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. మొదటి కారణం మనం జెనెటికల్‌గా అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి, రెండవ కారణం ఈనాటి యువత చాలా నిశ్చల జీవనశైలికి అలవాటు పడ్డారన్నారు. ఐటీ , బ్యాంకు సెక్టార్లలో ఎక్కువసేపు కూర్చొని పనిచేసే జీవనశైలి, వారు వారి జీవనశైలి పై ఆరోగ్యం పట్ల ఆటల పట్ల వ్యాయామాల పట్ల ఎలాంటి ధ్యాస చూపట్లేదన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ హెల్త్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్, కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, మాజీ రాజ్యసభ సభ్యులు టిజి. వెంకటేష్ హాజరయ్యారు. డాక్టర్ పి చంద్రశేఖర్ మాట్లాడుతూ కర్నూలు హార్ట్ ఫౌండేషన్ 20 యేళ్లుగా నిర్వహిస్తున్నామని అన్నారు. దీని ద్వారా ముందస్తు గుండెపోటును నివారించడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ పనిచేస్తుందని అన్నారు. మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ మంచి సర్వీస్ అందిస్తున్న డాక్టర్ ప్రతాప్ చంద్రరాత్ ఈ అవార్డు అందించటం గర్వకారణం అని అన్నారు. సేవ చేసే వారిని మరింత అభినందించడం ద్వారా వారు మరింత మంచి సేవ చేయడానికి తోడ్పడుతుందని అన్నారు. ఎంపి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఒత్తిడిల వల్లే అనేక జబ్బులు వస్తున్నాయన్నారు. ఎంతోమంది ప్రముఖులు కూడా గుండె జబ్బులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ విద్యావేత్త కెవి.సుబ్బారెడ్డి, కల్కూర చంద్రశేఖర్, డాక్టర్ భవానీ ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, నర్సింగ్ కాలేజీ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రతాప్ చంద్రరత్‌ను సన్మానిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, ఎంపీ నాగరాజు, టిజివి

డిసెంబర్ 31 నుండి సిఐటియు అఖిల భారత మహాసభలు

- రైస్ మిల్లు హమాలీ కార్మికుల సమావేశంలో గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర రైస్ మిల్లు హమాలి కార్మికుల విస్తృతస్థాయి సమావేశం కెకె.భవన్‌లో నిర్వహించారు. సమావేశానికి రైస్ మిల్ హమాలి యూనియన్ నాయకుడు గాలెన్న అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయ్ సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఆర్.నరసింహులు, కోశాధికారి సిహెచ్ సాయిబాబాలు రైస్‌మిల్‌హమాలి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సిఐటియు అఖిలభారత మహాసభలు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు ఐదురోజులపాటు మహాసభలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ మహాసభలకు భారతదేశంలోని అన్ని రంగాల కార్మికవర్గనాయకులు దేశ విదేశాల నుండి కార్మిక వర్గ నాయకులు అఖిలభారత మహాసభలకు రాబోతున్నారన్నారు. లక్షలాదిమంది కార్మికులతో పెద్ద ర్యాలీబహిరంగసభ ఉంటుందన్నారు. ఈ మహాసభలలో ఐదు రోజుల పాటు సంఘటిత అసంఘటిత రంగ ఉద్యోగకార్మికుల సమస్యల పైన చర్చించబోతున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పనిభద్రత కల్పించాలని ఆశ ,అంగనవాడి, మధ్యాహ్న భోజనం ,స్కీం వర్క్ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ఒ ,గ్రాడ్యుటీ అమలు చేయాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులైన భవన నిర్మాణం ఆటో హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఎస్ఐపిఎఫ్ అమలు చేయాలన్నారు. ఎల్ఐసి బిఎస్ఎన్ఎల్, రైల్వే విశాఖ ఉక్కు ఎయిర్ ఫోర్సు, షిప్‌యార్డ్స్ తదితర ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుపరం, చేయకూడదని ప్రభుత్వమే నిర్వహించి చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కాబోతున్నామని తెలిపారు.

మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

మాట్లాడుతున్న రాఘవేంద్ర

భగత్ సింగ్ ఆశయ సాధనే ఘనమైన నివాళి

- డివైఎఫ్ఐ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

భగత్ సింగ్ ఆశయ సాధన కోసం పనిచేయడమే ఘనమైన నివాళి అని డివైఎఫ్ఐ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా యువతకు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్ ప్రారంభానికి హాజరై భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం రాఘవేంద్ర అబ్దుల్లా మాట్లాడారు. భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిదాయకమని ఆయన ఆలోచనలు విప్లవానికి దారులన్నారు. ఆకలి, అసమానతలు అంటరానితనం, కుల వివక్ష లేని సమాజం కోసం కలలుకన్నారని అన్నారు. స్వాతంత్రం ద్వారా ప్రతి ఒక్కరికి కూడు గూడు గుడ్డ కావాలని, దాని కోసం సంపూర్ణ స్వాతంత్రం కావాలని పిలుపునిచ్చిన మహానేత అన్నారు. ఆయన స్ఫూర్తితో ఆయన ఆశయ సాధన కోసం యువతి యువకులు కృషి చేయాలన్నారు. నిరుద్యోగం లేని భారతాన్ని నిర్మించుకోవాలని, ఆకలి లేని సమాజం కోసం పోరాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతపై చేస్తున్న నిర్లక్ష్యానికి భగత్ సింగ్ స్ఫూర్తితో నడుం బిగించాలని అదే భగత్ సింగ్‌కు ఘనమైన నివాళి అని అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రకాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అంజి పాల్గొన్నారు.

టమోటా రైతుకు రూ.25 వేల సబ్సిడీ

ప్రజాశక్తి-పత్తికొండ

రెండు ఎకరాలలో టమోటా పంటను స్టాకింగ్ చేసిన రైతులకు రూ.25వేల ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ గూడూరు రాఘవేంద్ర చౌదరి, జిల్లా ఉద్యానవన అధికారి రాజా కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పత్తికొండ పట్టణంలోని సేవాలాల్ రైతు ఉత్పత్తిదారులు సంఘం ఆధ్వర్యంలో రైతులకు టమోటా పంట సాగు యాజమాన్య పద్ధతులుపై శిక్షణ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ గూడూరు రాఘవేంద్ర చౌదరి హాజరై మాట్లాడారు. టమోటా పంటలో వర్షపు నీరు నిలవ లేకుండా సాధ్యమైనంత త్వరగా బయటికి పంపాలన్నారు. 19:19:19- 5 గ్రాములు లేదా13-0-45 ఐదు గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారి చేయాలన్నారు. కాయ కుళ్ళు తెగులు బ్యాక్టీరియా మచ్చలు నివారణకు కాపర్ ఆర్చి క్లోరైడ్, మూడు గ్రాములు లీటర్ నీటికి, ప్లాంటమైసిన్0.5 పిచికారి చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. టమోటా పంటలు సూచనలు సలహాలు తప్పనిసరిగా పాటించి అధిక దిగుబడిని పొందాలని అన్నారు. రైతు పత్తికొండ ఉద్యాన అధికారి రఘువరన్ హెచ్ ఇఒ నాగ సునీల్ కుమార్, సేవాలాల్ రైతు ఉత్పత్తిదారుల మ్యూచువల్ ఏజెంట్ కోఆపరేటివ్ సొసైటీ రైతులు పాల్గొన్నారు.

నేటి సమాజానికి ఆదర్శం గుర్రం జాషువా

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

నేటి సమాజానికి ఆదర్శం గుర్రం జాషువా అని సాహితీ స్రవంతి జిల్లా సాహితీ స్రవంతి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్.నాగమణి, వీవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు దేవరకొండ జ్యోత్స్న దేవి పేర్కొన్నారు. ఆదివారం పాఠశాలలో గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ చందో బద్ధ కావ్యాలను ఎంతో నిబద్ధత తో అస్పృస్యుల పక్షాన నిలబడి రచించిన తిరుగుబాటు కవిత్వ లావా జాషువా. ఒక విధంగా వ్యవస్థపై రాజీ లేని తిరుగు బాటు చేస్తూ తన పద్యాక్షారాలను నిప్పు కణికలుగా భగ భగ మండించిన శ్రీ శ్రీ , జాషువా అని అన్నారు. ఆయన రచించిన ఫిరదౌసి ,ముంతాజ్ , గబ్బిలం పుస్తకాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు , తెలుగు ఉపాధ్యాయులు కె వీరేష్ రావ్, సంయుక్త , సుశీల , జనవిజ్ఞావేదిక జిల్లా అధ్యక్షులు శంకరయ్య ,కవి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న నాగమణి , తదితరులు

గబ్బిలంతో యుద్ధం ప్రకటించిన జాషువ

కోసిగి : సామాజిక అంతరాలు, అంటరానితనంపై గబ్బిలంతో యుద్ధం ప్రకటించిన విశ్వనరుడు గుర్రం జాషువా అని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి ఆనంద్ బాబు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ గృహంలో గుర్రం జాషువా 130వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి రామకోటి హనుమంతు అధ్యక్షతన జరిగిన జయంతిలో వారు మాట్లాడుతూ కులాంతర వివాహం చేసుకున్న గుర్రం వీరయ్య, లింగమ్మ దంపతులకు జన్మించిన గుర్రం జాషువా ఆది నుండే అవమానాలకు అంటరానితనానికి గురయ్యాడన్నారు. పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా, బైబిల్ మిషనరీలో అధ్యాపకుడిగా, రేడియో వ్యాఖ్యతగా, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రచారకుడిగా వివిధ వృత్తుల నిర్వహించిన జాషువా సాహిత్యంపై తనకున్న పట్టుతో కుల మతాలకతీతంగా విశ్వనరుడిగా ఎదిగాడన్నారు. దేవాలయాల దగ్గర దళితుడైన మనిషిని దూరం ఉంచిన సమాజాన్ని నిరసిస్తూ

కోసిగిలో జాషువాకు నివాళి అర్పిస్తున్న ఆనంద్‌బాబు, తదితరులు

గబ్బిలంను కథా వస్తువుగా ఎంచుకుని ఈశ్వరుడికి అంటరాని వారి బాధను గబ్బిలం ద్వారా చెప్పిన గొప్పవాడన్నారు. జాషువా స్ఫూర్తితో అంటరాని తనానికి వ్యతిరేకంగా ఉద్య మించాలన్నారు.

జాషువాకు ఘన నివాళి: విశ్వ మానవ సందేశాన్ని, సమతా దృక్పథాన్ని తన కవిత్వాల రూపంలో సమాజానికి అందించిన విశ్వ కవి గుర్రం జాషువా అని దళిత రచయితల సంఘం గౌరవాధ్యక్షులు కదిరికోట ఆదెన్న, వ్యవస్థాపక అధ్యక్షులు, రచయిత ఆరెకంటి భాస్కర్, ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షులు రంగస్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో దళిత రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఉపాధ్యాయులు పి.మాదన్న ఆధ్వర్యంలో గుర్రం జాషువా 131వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పుట్టుకతో దళితుడై, కృషితో కవి శేఖరుడై, నవయుగ కవి చక్రవర్తియై, తన కవితా యాత్ర విజయకేతనాన్ని తెలుగు సాహితీ గగనంలో ఉవ్వెత్తున ఎగరేసిన విశ్వ మానవుడు గుర్రం జాషువా అని కొనియాడారు. జాషువా స్ఫూర్తితో రచయితలు తమ రచనలను సమాజాన్ని మేలు కొల్పే విధంగా రాయాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ మద్దిలేటి, ప్రభాకర్, యు. లక్ష్మన్న, నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పి.మద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో హైడ్రా తరహాలో చర్యలు అవసరం

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని పట్టణంలో అక్రమ కట్టడాలు పెరుగుతూనే ఉన్నాయి. మురుగు కాలువలు వంకలపై అక్రమ కట్టడాలు పెరుగుతుండడంతో నీరు పారెందుకు అవకాశం లేని పరిస్థితి చిన్నపాటి వర్షం కురిసిన ఖునిమహల్, హౌసింగ్ బోర్డ్ కాలనీ ,బార్పేట్, కౌడల్ పేట ప్రాంతాలలో ఇళ్లలోకి నీరు చేరుతున్నాయి. 15 అడుగులు ఉండాల్సిన వంకలు మూడు అడుగులకు కుదించడంతో నీరు పొంగిపొర్లుతుంది. దీంతో లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న సామాన్య జనం ఇళ్లలో నీరు చేరి అస్తవ్యస్తమై నిరాశ్రయులయి ఇబ్బందులు పడుతున్నారు.

ఆదోనిలో హైడ్రా నిర్వహించాలి: ఆదోని పట్టణంలో అక్రమ కట్టడాలు ఆక్రమణలు తొలగించేందుకు హైదరాబాద్ తరహాలో హైడ్రా యాక్టు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. శనివారం తెల్లవారుజాము నుండి ఉదయం వరకు సుమారు 126.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. భారీ వర్షం రాకతో రామ జల చెరువు పొంగి పొర్లింది. ఆ నీరు ప్రవహించే హౌసింగ్ బోర్డ్ కాలనీ లోని ఆదిత్య నర్సింగ్ హోమ్ గెస్ట్ హౌస్ వద్ద ఉన్న కల్వర్టులు రెండు రోజులు పాటు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కౌడల్‌పేట, కూని మహల్, బార్పేట ప్రాంతాలలో రెండు రోజులైనా నీరు తగ్గకుండా ఇళ్ళ ముందు నిలిచి ఉండడంతో పాములు, విషసర్పాలు సంచరిస్తున్నాయని ఆ కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఎవరో ఉన్నవాళ్లు ఆక్రమణలు చేస్తే తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల సందర్భంగా పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని అక్రమ కట్టడాలు కూల్చివేస్తామని చెబుతున్నా అధికారంలోకి రాగానే మరచిపోతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఇల్లు నిర్మించుకునే వారు సైతం మూడు అడుగుల స్థలం విడవకుండా మురుగు కాలువలపై కట్టడాలు చేపట్టడం వల్ల రోజురోజుకు కాలువల విస్తీర్ణం కుదించిపోతుందని చెబుతున్నారు. హైదరాబాద్ తరహాలో వంకా వాగులు ప్రభుత్వ స్థలాలు గుర్తించి కూల్చివేసి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కమిషర్

సమస్య తీరని వేదన కలిగిస్తుంది: ఈరమ్మ కోడల్ పేట

రాంజల వంక పరివాహక ప్రాంతంలో నివాసాలు ఉన్నాం. రెండు రోజులుగా నీరు ఉధృతంగా ప్రవహిస్తూ ఇళ్లలోకి వచ్చి చేరింది. తిండి గింజలు, బట్టలు తడిచి పోయాయి. మురుగు వాసన భరించలేని పరిస్థితి కాలువలు వెడల్పు చేసి అక్రమ కట్టడాలు తొలగిస్తే భవిష్యత్తులో ఇలాంటి సమస్య కొంతవరకు ఉపశమనం కలుగుతుంది. రాజకీయ నాయకుల మాటలకు తలొగ్గిన ఇదే పరిస్థితి ఉంటుంది. వారి నిస్సహాయ పరిస్థితుల వల్ల ఇబ్బందులు గురి చేయడం సమంజసం కాదు.

ప్రజలకు అందుబాటులోనే ఉన్నాం: కృష్ణ, మున్సిపల్ కమిషనర్ ,ఆదోని

వర్షం కురిసిన ప్రతిసారి నీళ్లు నిలిచాయని ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. వెళ్లి చూసి కాలువలు లోనే పూడిక తీయించి నీరు పారేలా చేస్తున్నాం. సమస్య మాత్రం తీరడం లేదు. రెండు రోజులుగా ప్రజలు పడిన ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అక్కడక్కడ అన్యక్రాంతమైనట్లు అక్రమ కట్టడాలు గుర్తించాం. కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లి నిర్ణయం తీసుకునేలా శ్రద్ధ తీసుకుంటాం. అక్రమ కట్టడాలు తొలగించని పక్షంలో భవిష్యత్తులో మరింత సమస్య తలెత్తే అవకాశం ఉంది. ప్రజలు సహకరించాల్సి ఉంది.

పెద్దవాగు బ్రిడ్జిని నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మంత్రాలయం

మంత్రాలయం మండల పరిధిలోని మాలపల్లి, పెద్దకడబూరు మండల పరిధిలోని కంబలదిన్నె గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగు బ్రిడ్జిని వెంటనే నిర్మించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రెండు రోజులు నుండి పెద్దవాగు పొంగి పొరలి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించిందన్నారు. ఆదివారం వాగును పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో శనివారం ఒక కొత్త బైకు కొట్టుకొని పోయిందని, ట్రాక్టర్ కొట్టుకొని పోగా ప్రజలంతా కలిసి ఆపి దాన్ని పైకి లాగారన్నారు. ఆ మార్గం గుండా పోయే ద్విచక్ర వాహనదారులు పోలేక పోవడంతో రూ.50 ఒక మోటార్ సైకిల్ చొప్పున గ్రామ యువకులంతా మూకుమ్మడిగా పట్టుబట్టి వాగును దాటించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బ్రిడ్జి నిర్మించక నిర్లక్ష్యంగా చోద్యం చూస్తున్న పాలకుల దే తప్పన్నారు. ఆ దారి కాదంటే మరో 50 కిలోమీటర్లు చుట్టేసుకుని పోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా పాలకుల దష్టిపెట్టి బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు ఆనంద్‌బాబు

బిల్లులు ఇవ్వని ఆస్పత్రులపై ఫిర్యాదు చేస్తాం

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

చికిత్స పొందిన రోగులకు సమయానికి బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు గురిచేసే ఆసుపత్రులపై సీఎం చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేస్తామని మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి మీనాక్షి నాయుడు హెచ్చరించారు. ఆదివారం ఆయన నివాసం వద్ద సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని జబ్బులకు చికిత్స పొందిన రోగులకు సకాలంలో ఆసుపత్రుల నిర్వాహకులు బిల్లులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వారి సహనాన్ని పరీక్షిస్తున్నట్లు తమ దృష్టికి తెచ్చారన్నారు. డబ్బు తీసుకొని బిల్లు ఇవ్వక పోతే రోగులు ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. అలాంటి వారికి ఆర్థికంగా కొంత వెసులుబాటు కల్పించేందుకే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అమౌంట్ మంజూరు చేయిస్తున్నామన్నారు. ఆదోనిలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 37 మంది బాధితులకు రూ.15,70,977 విలువైన చెక్కులను అందించామన్నారు. బియ్యం కార్డు కలిగిన పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఒక వరంలా మారిందిని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఇది ఎంతో దోహదపడుతోందని తెలిపారు. చెక్కులు అందుకున్న బాధితులు సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అప్సర్ బాషా, ఎల్ఎల్‌సి డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ బసాపురం రామస్వామి, లక్ష్మణ్, తిరుమలేష్, అయ్యన్న తదితరులున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఇస్తున్న మీనాక్షి నాయుడు

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటం

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు : భగత్ సింగ్ స్ఫూర్తితో మెడికల్ కళాశాలల ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకుందామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం భారత స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ 118వ జయంతి కార్యక్రమం ఎమ్మిగనూరు సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ మాట్లాడుతూ ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో తన 23 సంవత్సరాల అతి చిన్న వయసులో ఉరి కంబాన్ని ముద్దాడిన వీర యోధుడు భగత్ సింగ్ అని అన్నారు. చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచి పోయాడని దేశానికి స్వాతంత్రం రావడం కోసం అందరూ సమానంగా బతికే నవ సమాజం రావాలని కలలుగన్నారని అన్నారు. ఆయన ఇచ్చిన నినాద స్ఫూర్తితో ఆయన కలలుగన్న నవ సమాజం కోసం నేటి యువత నడుంబిగించాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలో మతం పేరుతో దాడులు హత్యలు, మత కలహాలు జరుగుతూ లౌకిక వ్యవస్థకు ప్రమాదకరంగా మారిందని మతోన్మాదంపై కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే విద్యా వ్యతిరేక విధానాలపై ఎస్ఎఫ్ఐ పోరా టాలు నిర్వహిస్తుందని అన్నారు. ఆదోనిలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలను పిపిపి పేరుతో పేద విద్యార్థుల నష్టపోవడమే కాక ప్రాంతీయంగా ఉండే పేద ప్రజలకు కూడా వైద్యం దూరమవుతుందని అన్నారు. ఈ విధానాలను ప్రతి ఒక్కరు వ్యతిరేకించినప్పుడే మనం నిజంగా భగత్ సింగ్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అర్పించినట్లని అన్నారు. యుగంధర్ రెడ్డి, యశ్వంత్, జై తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న రంగప్ప, తదితరులు

దేవనకొండ : పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భగత్ సింగ్ స్ఫూర్తితో నికరమైన పోరాటాలు డివైఎఫ్ఐ కార్యకర్తలు నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.వీర శేఖర్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు, సిఐటియు మండల కార్యదర్శి అశోక్‌లు పేర్కొన్నారు. సర్దార్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు మహేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు.

ఆదోని రూరల్ : మండలం బల్లెకల్లు, పాండవగల్, కుపగల్, పెద్దతుంబలం, పెద్దహరివనం, గణేకల్ గ్రామాలలో ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఐటియు మండల కార్యదర్శి బి. వీరారెడ్డి మాట్లాడారు.

అధిక వర్షాల వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-దేవనకొండ

మండల వ్యాప్తంగా ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో కురిసిన భారీ వర్షాల వలన మండలంలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ,దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇచ్చి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, పార్టీ మండల నాయకులు అశోక్ , యూసుఫ్ భాషలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో ముఖ్యంగా ఆగస్టు ,సెప్టెంబర్ నెలల్లో తుఫాన్ల ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వలన మండలంలోని పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటికే పండిన ఉల్లి, టమోటా, పత్తి పంటలకు సరైన ధర లేక రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని ములిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా అతివష్టి వలన ఇతర పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. పత్తి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలో వెంటనే రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు యంత్రాంగం నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయంగా పరిహారం అందేలాగా చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ నాయకులు పాండురంగడు, మహేంద్ర, శ్రీనివాసులు, వీరేంద్ర నాయుడు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండలో మాట్లాడుతున్న వీరశేఖర్

సమాజ మార్పు కోసం కవయిత్రులు కృషి చేయాలి

కవయిత్రుల సమ్మేళనంలో సత్యనారాయణగుప్త

ప్రజాశక్తి- కర్నూలు కల్చరల్ : సమాజంలో జరుగుతున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకుని తమ సాహిత్యం ద్వారా మార్పు తీసుకురావాలని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొత్తూరు సత్యనారాయణ గుప్త కోరారు. ఆదివారం ఉదయం గణేష్ సాహితీ సదన్‌లో 8వ జాతీయ కవయిత్రుల సమ్మేళనం నిర్వహించారు. కవయిత్రి సువర్ణ జోషి అధ్యక్షత వహించారు. కొత్తూరు సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ సాహిత్యంలో రేపటి తరానికి రచయిత్రులు బాటలు వేయాలన్నారు. భారత దేశంలో అనేక భాషల సముదాయంలో తెలుగు భాషకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తెలుగు సాహిత్యం కేవలం పద్యాలు కథలు మాత్రమే కాదని మన సంస్కృతి, విలువలు మన జీవన విధానానికి మార్గమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి జిల్లా కేంద్రంలో సాహితీ భవనాలను ప్రభుత్వం నిర్మించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సువర్ణ జోషి మాట్లాడుతూ జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జాతీయ స్థాయిలో కవయిత్రుల సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కవయిత్రులు వారికి ఇచ్చిన అంశాలపై కవితలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమం సునీత విలియమ్స్ పేరిట నిర్వహించడం గర్వించదగ్గ విషయమని అనంతపూర్ కు చెందిన సింగడి శోభ తెలిపారు. సునీత విలియమ్స్ పేరిట అవార్డులను జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొత్తూరు సత్యనారాయణ గుప్తా ప్రకటించారు. కర్నూలుకు చెందిన కళ్యాణదుర్గం స్వర్ణలత, చోడవరం నుండి వచ్చిన రూపాదేవి, ఆదోనికి చెందిన నాగజ్యోతి, అనంతపూర్ కు చెందిన సింగాడి శోభ ,ఆలూరుకు చెందిన సువర్ణ జోషి, చిత్తూరు జిల్లాకు చెందిన పావని తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణగుప్త

ఘనంగా విట్టా రమేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -ఆదోని

ఆదోని కి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు విట్టా రమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆదోనిలోని బీమాస్ హోటల్లో పూలమాల శాలువాలతో విట్టా రమేష్‌ను రాజకీయ నాయకులు అభిమానులు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. విట్టా రమేష్ మాట్లాడారు ఆదోని పట్టణంలో పరిశ్రమలు నెలకొల్పి ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఆదోని పురవాసులకు ఇబ్బందులు వచ్చినా తాము అండగా ఉంటున్నామన్నారు. విట్టా రమేష్ కు రాజకీయంగా పదవులు దక్కి ప్రజాసేవలో భాగస్వామ్యం అయ్యేలా ప్రభుత్వం ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ షఫీ అహ్మద్, బీమా లింగప్ప, హోటల్ మేనేజర్ నాగరాజు, ఆనంద్, రామయ్య, రామచంద్ర అభిమానులు ఉన్నారు.

4 నెలలకే కంకర తేలిన రోడ్డు

-కాంట్రాక్టర్ పై పర్యవేక్షణ చేసిన ఇంజనీర్ పై చర్యలు తీసుకోవాలి

-పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని నెహ్రూ రోడ్డులో గత నాలుగు నెలల క్రితం వేసిన సిసి రోడ్డు చిన్నపాటి వర్షానికి కంకర తేలి గుంతలు పడ్డాయని నాసిరకంగా రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌పై, మున్సిపల్ ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం ప్రతినిధి బృందం పర్యటించింది. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ నాయకత్వంలో నెహ్రు రోడులో నాసిరకంగా వేసిన రోడ్లను పరిశీలించారు. డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ సిసిరోడ్ అంటేనే దాని కాల పరిమితి కనీసం 20 సంవత్సరాలు పైబడి ఉంటుందన్నారు. నెహ్రూ రోడ్డులో వేసిన కొత్త సిసి రోడ్డు నాలుగు నెలలకే గుంతలు పడడం చూసిన తర్వాత ఇంజనీర్లకు స్థానిక రాజకీయ నాయకులకు ఎంత కమిషన్ ముట్ట చెప్పారని, అవినీతి ఎంత జరిగిందో చాలా స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. మున్సిపల్ అధికారులు కళ్ళు మూసుకుని ఫైళ్ళపై సంతకాలు పెట్టి బిల్లులు మంజూరు చేశారని విమర్శించారు. కనీసం క్వాలిటీ కంట్రోల్ అధికారులైనా ఇంత నాసిరకమైన రోడ్లు వేస్తే ఎందుకు పరిశీలించలేదన్నారు. ఎందుకు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాడు. కర్నూల్ నగరంలో అభివృద్ధి పనులు కల్వర్ల పేరుతో డివైడర్ల పేరుతో జరుగుతున్నప్పటికీ పర్యవేక్షణ అనేది కొరబడుతుందని కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా ఉన్నదని, పర్యవేక్షణ చేయాల్సిన ఇంజనీర్లు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజాధనాన్ని ఇష్టానుసారంగా దుర్వినియోగం చేస్తుంటే ప్రజలు చూస్తూ కూర్చోరని ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకొని ఎక్కడైతే నాసిరకం పనులు జరుగుతున్నాయో గుర్తించి ఆ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని తిరిగి వారి సొంత నిధులతోనే అక్కడ రోడ్లు వేయించాలన్నారు. లేదంటే నిధులు రికవరీ చేయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఎం అవినీతి అధికారులపై ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న కాంట్రాట్లపై చర్యలు తీసుకునే వరకు పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ పర్యటనలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్, అబ్దుల్లా , సిపిఎం సీనియర్ నాయకులు పార్వతయ్య, బజార్, శాలి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

ఉచిత అంబులెన్స్ ఏర్పాటు

ప్రజాశక్తి- ఆదోని

భగత్ సింగ్ స్ఫూర్తితో ఉచిత అంబులెన్స్ పాండవగల్లు గ్రామానికి చెందిన సోషల్ వర్కర్ ఎం.తాహేర్‌వలి భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం నుంచి ఉచిత అంబులెన్స్ సేవను ప్రారంభించారు. భగత్ సింగ్ త్యాగస్ఫూర్తిని అనుసరిస్తూ పేదలు, గర్భిణీల కోసం ఈ సేవను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ఎంపిటిసిలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలం సర్వసభ్య సమావేశాన్ని ఎంపిటిసిలు ఆదివారం బహిష్కరించారు. అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలు ఉన్న రోజుల్లో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించరాదనే నిర్ణయం కారణంగా, ఆదివారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. వైసిపి తరపున గెలిచి ఎంపిపిగా ఎన్నికైన దానమ్మ, భర్త పంపాపతి సార్వత్రిక ఎన్నికల ఫలితాలు అనంతరం బిజెపిలో చేరారు. దీంతో వైసిపి సభ్యులు గత వారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందించారు. పార్టీ ఫిరాయించడంతో సమావేశానికి బాయ్‌కాట్ చేశారు. ఎంపీటీసీలు బహిష్కరించడంతో.. ఓ ముగ్గురు సర్పంచులతో... మండల స్థాయి అధికారులకు ఈ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి హాజరయ్యారు.

నిరసన తెలుపుతున్న సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు

గ్రామ కంఠం భూమి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలం పరిధిలో బల్లెకల్లు గ్రామంలో సర్వేనెంబర్ 128లో గ్రామకంఠం భూమి అక్రమంగా చేసిన రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని,గ్రామ కంఠం భూమిని కాపాడాలని డివైఎఫ్ఐ,సిఐటియు మండల నాయకులు ఆదివారం గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సిఐటియు ఆటో యూనియన్ మండల కార్యదర్శి వీరేష్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శ్రీకృష్ణ మాట్లాడుతూ గ్రామ సర్పంచి లోకేష్ బల్లకల్ గ్రామంలో గ్రామకంఠం భూమి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. రిజిస్ట్రేషన్ అయిన దానిని రద్దు చేయాలని, ప్రభుత్వ భూమీ అనేది కేవలం ప్రజలకు, ప్రభుత్వానికి ఉపయోగ పడేవిధంగా ఉండాలని, ఆక్రమణలకు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉందని డివైఎఫ్ఐ, సిఐటీయు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు,డివైఎఫ్ఐ సిఐటియు నాయకులు నాగార్జున,ఉరుకుంద, రమేష్, రవి, తిమ్మప్ప, కృష్ణ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో సమస్యలు తెలపండి

ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

ప్రజాశక్తి-ఆలూరు

అన్యాయానికి గురైన కార్యకర్తలకు అండగా క్యూఆర్ కోడ్ డిజిటల్ బుక్ ను ఆదివారం ఆలూరు ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో క్యూఆర్ కోడ్ వాల్ పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఎలాంటి ఆపదలో ఉన్నా అధికార పార్టీనుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌లో నమోదు చేయాలని తెలిపారు. కిట్టు,ఈరన్న,మల్లికార్జున, భాస్కర్, రామ్ గోపాల్, మహానంది, ఎస్‌కె గిరి, వీరేష్, నాగేంద్ర, కొట్టాల రాజు, ఎల్లప్ప, వెంకటేష్, వరుణ్ పాల్గొన్నారు..

ఎమ్మిగనూరు: వైసిపి కార్యకర్తలకు అండగా నిలిచేందుకే డిజిటల్ బుక్ తీసుకొచ్చినట్లు వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బుట్టా రేణుక పేర్కొన్నారు. ఆదివారంపట్టణంలోని శిల్పాయి స్టేట్ వైసిపి కార్యాలయంలో కార్యకర్తలు కోసం డిజిటల్ బుక్ యాప్ ను నాయకులు కార్యకర్తలు కలిసి ఆవిష్కరించారు. బుట్టా రేణుక మాట్లాడుతూ- కూటమి ప్రభుత్వంలో వైసిపి కార్యకర్తలకు ఎక్కడైనా అన్యాయం జరిగితే ఆ సంఘటనలను డిజిటల్ బుక్ లో నమోదు చేసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్టేట్ పార్లమెంటు సెక్రెటరీ ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి ,పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ , కె ఆర్ మురారి రెడ్డి ఎమ్మిగనూరు నియోజకవర్గం పరిధిలోని రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు నాయకులు,మండలాల పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు వార్డ్ ఇన్చార్జిలు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు,పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరిస్తున్న బుట్టారేణుక, తదితులు

క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

ఆదోనిరూరల్ : పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్నసమస్యలకు పరిష్కారానికి వైసిపి రూపొందించిన డిజిటల్ బుక్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తన స్వగృహంలో క్యూఆర్ కోడ్ వాల్ పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీకి పని చేస్తున్న కార్యకర్తలు ఎలాంటి ఆపదలో ఉన్నా, వారి సమాచారం తక్షణమే నాయకత్వానికి చేరేలా క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ బుక్‌ను రూపొందించామన్నారు. ప్రతి కార్యకర్తకు ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. ఈ ఆధునిక వ్యవస్థ ద్వారా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడమే లక్ష్యమని తెలిపారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి మహేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి, సర్పంచి జయమ్మ, కౌన్సిలర్ ఫయాజ్, రామలింగేశ్వర, అడ్వకేట్ నాగరాజ్, వైసిపి సీనియర్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు

-మాట్లాడుతున్న ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

బైపాస్‌కు సర్వీస్ రోడ్డు వేయాలి

- ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని బైపాస్ రైల్వే బ్రిడ్జి పక్కన సర్వీసు రోడ్లు చేయాలని ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ తెలిపారు. ఆదివారం రైల్వే వంతెన వద్ద నిర్మించిన రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైల్వే వంతెనపై నిర్మిస్తున్న హైవే రోడ్డు కింద భాగాన సర్వీస్ రోడ్డు వేయడం లేదని తెలిసిందన్నారు. కాంట్రాక్టరుకు సర్వీస్ రోడ్డు పని ఇవ్వలేదని అందుకే వేయడం లేదని అక్కడ పని చేస్తున్న కొందరు తమతో చెప్పారన్నారు. ప్రభుత్వము రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కన సర్వీస్ రోడ్లు కచ్చితంగా వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎందుకంటే సర్వీస్ రోడ్డు లేకపోతే పక్కన ఉన్న కాలనీలకు, నూతనంగా నిర్మిస్తున్న ఇండ్లకు రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంటుందని, అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. సర్వీస్ రోడ్లు బైపాస్ పక్కన వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సామావేశంలో ఎంహెచ్‌పిఎస్ నాయకులు నరేంద్ర యాదవ్, హాఫీజ్ పాల్గొన్నారు.

కవిత్వంతో సమానత్వం చాటిన గుర్రం జాషువా

ప్రజాశక్తి-మంత్రాలయం

మంత్రాలయంలో జాషువాకు కెవిపిఎస్ నివాళి

సమాజంలో ఉన్న అసమానతలను తన కవిత్వంతో సమానత్వం చాటిన ఆధునిక కవి గుర్రం జాషువా అని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్ జయరాజు అన్నారు. ఆదివారం గుర్రం జాషువా జయంతి సందర్భంగా స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద వరండాలో కెవిపిఎస్ మండల కార్యదర్శి జి.అంజి అధ్యక్షతన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కుటుంబంలో 1895 సెప్టెంబర్28న గుర్రం జాషువా జన్మించారన్నారు. కుల మత అసమానతలను తన కవిత్వంతో కుల పై పట్టిన బూజును దులిపిన వ్యక్తి జాషువా అని కొనియాడారు. అడుగడుగునా కులం పేరుతో నెట్ట వేయబడిన వ్యక్తి గుర్రం జాషువా తెలుగు కవిత్వంలో జాషువాను మించిన వేరే కవి లేడని పేర్కొన్నారు. కెవిపియస్ నాయకులు అనిల్ సెంట్రింగ్ చిట్టిబాబు, సిఐటియు నాయకులు టి. ప్రాణేష్, కాటి కాపరి నాయకులు భీమన్న ,జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపులు గొడవలు వద్దు

సాంప్రదాయంతో పండగ జరుపుకుందాం ఎస్ఐ దిలీప్ కుమార్

ప్రజాశక్తి - హోళగుంద

కక్ష సాధింపులకు గొడవలకు దూరంగా ఉండి సాంప్రదాయంతో విజయదశమి సందర్భంగా దేవరగట్టు లో స్వామివార్ల జైత్రయాత్ర (బన్నీ ఉత్సవం) జరుపుకుందామని ఎస్ఐ దిలీప్ కుమార్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని సులువాయి గ్రామంలో గ్రామ ప్రజలతో కలిసి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్ష సాధింపులు గొడవలు వల్ల కుటుంబాల రోడ్డున పడతాయి సాంప్రదాయంతో పండగను జరుపుకుంటే అందరూ సంతోషంగా ఉంటామన్నారు. అలాకాకుండా తాగి అల్లర్లకు పాల్పడినా, సారా అమ్మిన ఎంతటి వారినైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రింగ్ కర్రెలకు దూరంగా ఉండండి దివీటీలను కాలిన తర్వాత ఒకరి మీద ఒకరి విసురుకోకుండా కింద పడేయడం మంచిదన్నారు. సాంప్రదాయబద్ధంగా సంతోషంగా విజయదశమి పండుగను జరుపుకొని అధికారులకు సహకరించాలన్నారు.గ్రామ పెద్దలు గ్రామస్తులు పోలీసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన దేవరగట్టు

ప్రజాశక్తి -హోళగుంద

విజయదశమి బన్నీ ఉత్సవాలలో భాగంగా ఆదివారం దేవరగట్టు శ్రీ మల్ల మల్లేశ్వర దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది.శనివారం రాత్రి గణపతి పూజ కంకణ ధారణం జరగక భక్తులు ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఉదయం 5 గంటల నుండి భక్తులు విరివిగా తమ ముక్కులు తీర్చుకున్నారు. దేవరగట్టులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమన్వయ లోపంతో తరుచూ ప్రమాదాలు

-20 ఏళ్లుగా మురుగు నీటి దుర్వాసనతో ఇబ్బంది

-పట్టించుకునే వారే కరువయ్యారని మహిళల ఆవేదన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కోట్ల రైల్వే స్టేషన్ సమీపంలో తారకరామానగర్ ఎదుట ముందు చూపు లేకుండా నిర్మించిన రైల్వే బ్రిడ్జి కింద మురుగు నీరు నిలిచి దుర్వాసన, దోమలతో పాటు రోజు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానిక మహిళలు ఆదిలక్ష్మి, మస్తాన్ బి, మల్లేశ్వరి, సుంకన్న, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానికులతో కలిసి పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం తారకరామ నగర్‌లో పర్యటించింది. వారు మాట్లాడుతూ మురుగు నీరు, వర్షం నీరు బ్రిడ్జి కింద చేరి రోజు అనేకమంది కిందపడి గాయాల పాలవుతున్నారని తెలిపారు. రైల్వే బ్రిడ్జి కింద మురుగు నీరు నిలవడం చెత్త పేరుకొని పోయి దోమలు, దుర్వాసన వల్ల సమీపంలో ఉండే వారందరూ అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. నగరపాలక సంస్థ అధికారులు రోజు ట్యాంకర్‌తో, మోటారుతో మురుగునీరు తొలగిస్తూ తాత్కాలిక పనులు చేయడం తప్ప శాశ్వత పరిష్కారం పై శ్రద్ధ పెట్టడం లేదని విమర్శించారు. రైల్వేశాఖ, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో బ్రిడ్జి కింద నీళ్లు నిలవకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో సివి వర్మ, లక్షణ గౌడ్ ,శ్రీనివాసులు ,విజయుడు, భాస్కర్ రెడ్డి ,శేషగిరి, సాంబశివ ,సుంకన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు పుల్లారెడ్డి , తదితరులు

స్మార్ట్ కార్డులతో అక్రమాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి మంత్రాలయం : ప్రభుత్వం నుంచి మంజూరైన స్మార్ట్ కార్డులతో రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో వారి స్వగహంలో స్మార్ట్ రైస్ కార్డులను మంచాల సొసైటీ చైర్మన్ ఎన్. రామకృష్ణ రెడ్డి తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గానికి 2 లక్షల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ రావడం జరిగిందన్నారు. మన నియోజకవర్గంలో ప్రస్తుతం 200 రేషన్ డీలర్ షాపులు ఉన్నాయని , మరికొన్ని డీలర్ల సంఖ్యను త్వరలోనే పెంచేందుకు కషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం మాదిరి ప్రతి కార్డు పైన వాళ్ళ ఫోటో లేకుండా రాజముద్రతో ఈ స్మార్ట్ కార్డులు రూపాకల్పన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్డు ఒక గుర్తింపు కార్డులా పని చేస్తుందన్నారు. కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌కు స్కాన్ చేస్తే లబ్ధిదారుడు తీసుకొన్న సరుకుల సమాచారం ఫోన్‌లోకి వస్తుందన్నారు. కార్డుపై ఇంటి చిరునామా, కుటుంబ వివరాల మార్పులు, చేర్పుల కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అదే రోజు వారు అప్‌లోడ్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపి నియోజకవర్గ అధ్యక్షులు బి.రామకష్ణ,ఐటీడీపి వైస్ ప్రెసిడెంట్ చిదానందా,ఆర్గనైజ్ సెక్రటరీ మైబూబ్ పోలి శివ, విజయ్ బీమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి, తదితరులు

ఐక్యంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం

ఆలూరు ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి , స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం శివప్రసాద్

ప్రజాశక్తి - హోళగుంద

తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కషి చేస్తామని టిడిపి ఆలూరు బాధ్యులు వైకుంఠం జ్యోతి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం శివప్రసాద్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దేవరగట్టు శ్రీ మాల మల్లేశ్వర లను దర్శించుకున్నారు. అనంతరం కార్యకర్తలతో ముచ్చటించి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు నియోజకవర్గ ప్రజల అవసరార్థం ఏ పనులు కావాలన్నా నేరుగా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. టిడిపి అధికారంలో ఉండగా ఏ ఒక్కరు ఇబ్బంది పడకూడదన్న మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన అని గుర్తు చేశారు. వర్గాలను పక్కన పెట్టి ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను కలిసికట్టుగా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామన్నారు. టిడిపి మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, సీనియర్ నాయకులు ఈడిగ గోవింద్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, రాజేంద్ర, నాయకులు కే మహమ్మద్ ఆదం, రైస్ ఇండస్ట్రీ నేత మురళి, బుడగ జంగాల రామాంజనేయులు, గజ్జహళ్లి బొజ్జన్న, ముద్దటమాగి నాగేంద్ర, అయ్యాలప్ప, లక్ష్మయ్య అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలూరు ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి , స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం శివప్రసాద్

లక్ష్మమ్మకు వేరుశనగ విత్తనాలు,రాజ్మాలతో ప్రత్యేక అలంకరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదోని పట్టణంలోని మహాయోగి లక్ష్మమ్మ అమ్మవారిని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఆదివారం వేరుశనగ విత్తనాలు, రాజ్మాలతో ప్రత్యేక అలంకరణతో విశేషంగా అలంకరించారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చల్లావారీ వీధిలో అన్నదానం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బళ్లారి చౌరస్తా సమీపంలోని చల్ల వారి వీధిలో దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమ్మవారి దీవెనలతో ప్రజలు దినదినాభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు శ్రీహర్ష తెలిపారు. కార్యక్రమంలో హరినాథ్ గౌడ్, సిహెచ్.శ్రీనివాసులు, నరేష్‌రావు,లోకేష్, ప్రసన్న, రవితదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మార్కండేయ యూత్ వారి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర కంటి వైద్యశాల వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం ఉచిత వైద్య శిబిరం శ్రీ వెంకటేశ్వర కంటి వైద్యశాల వైద్యులు ఏ నాగ వంశీకృష్ణ ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈశిబిరం విజయవంతంగా నిర్వహించారు. దాదాపు 168 మందికి పైగా ఉచిత కంటి వైద్య పరీక్షలతో పాటు వారికి కావాల్సిన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఆడిమి నవీన్ కుమార్, ఎంఆర్ మోహన్ కృష్ణ, తాటికొండ శ్యామ్, సురఉదయ్, తరుణ్, లక్ష్మీకాంత్ పద్మశాలి సంఘం ప్రెసిడెంట్లు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.